
ప్రజాశక్తి
మంగళవారం 22 జులై 2025 5 విజయనగరం



డ్రోన్లతో నానో ఎరువుల వినియోగం

ప్రజాశక్తి-విజయనగరంకోట

రైతులకు ఉపయోగపడే విధంగా నానో ఎరువులు వాడకానికి డ్రోన్ లను వినియోగించాలని కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ ఛాంబర్ లో వ్యవసాయ శాఖ రూపొందించిన చీడ పురుగుల నుంచి పంటను కాపాడేందుకు దోహదపడే జీవన ఎరువుల ఆవశ్యకతను, నానో ఎరువులు ప్రచారం పోస్టర్, బ్రోచర్‌లను విడుదల చేసారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నానో ఎరువులు వినియోగం, ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. తక్కువ ధరలో లబించే పర్యావరణహితమైన నానో ఎరువులు వినియోగం పెంచడానికి వాటి వాడకం సులభతరం చేయాలన్నారు. అందుకు జిల్లాకు మంజురైన 17 వ్యవసాయ డ్రోన్ లను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని, వ్యవసాయ అధికారులు సమన్వయం తో పనిచేయాలని తెలిపారు. రసాయనిక ఎరువుల వాడకాన్ని 25% వరకు తగ్గించుకోవచ్చని వివరించడంతో పాటు, జీవన ఎరువులు పంటల దిగుబడి పెంపునకు, మట్టికి జీవనశక్తి కలిగించేందుకు దోహదపడతాయని వివరించారు.



రాజాంలో అంగన్వాడీల ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్



ఎస్.కోటలో ధర్నా చేస్తున్న అంగన్వాడీలు

ఎఫ్ఆర్ఎస్‌ను రద్దు చేయాలి

కనీస వేతనాలు, సంక్షేమ పథకాలు అమలు చేయాలి

సిడిపిఒ కార్యాలయాల వద్ద అంగన్వాడీల ధర్నాలు

ప్రజాశక్తి - కంటోన్మెంట్

అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే టేక్ హోం రేషన్, ఇతర సేవలకు ఎఫ్ఆర్ఎస్ ధ్రువీకరణ తప్పనిసరి చేసే నిబంధనను వెంటనే రద్దు చేయాలని, కనీస వేతనాలు, సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అంగన్వాడీ హెల్పర్స్, వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన సోమవారం జిల్లాలోని సిడిపిఒ కార్యాలయాల వద్ద అంగన్వాడీలు ధర్నాలు చేశారు. విజయనగరం సిడిపిఒ కార్యాలయం వద్ద జరిగిన ధర్నాలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బి.పైడిరాజు మాట్లాడారు. అంగన్వాడీ కేంద్రాల్లో రిపోర్టింగ్ విధానం డిజిటల్ లై జేషన్ అమలుకు ముందే అంగన్వాడీ కేంద్రలన్నింటికీ కంప్యూటర్ లాప్ టాప్ ట్యాబ్ లను అందించాలన్నారు. నాణ్యమైన మొబైల్ ఫోన్లు ఇచ్చేవరకు ఎఫ్ఆర్ఎస్ ను పక్కన పెట్టాలన్నారు. సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం ఆధార్ ధ్రువీకరణ గుర్తింపు లేకుండానే లబ్ధిదారులందరికీ నాణ్యమైన అనుబంధ పోషకాహారాన్ని అందించా లన్నారు. ధర్నాకు మద్దతు తెలిపిన సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టివి రమణ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను అంగన్వాడీలకు ఇబ్బంది కలిగించే విధానాలను తీసుకొస్తున్నాయన్నారు. అంగన్వాడీలకు కనీస వేతనం రూ. 26వేలైన ఇవ్వాలి లేదా సంక్షేమ పథకాలైన అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీల సమస్యల పరిష్కరించేంతవరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శి ఎ.జగన్మోహన్ రావు, ప్రాజెక్టు అధ్యక్షురాలు కె.ప్రభావతి, యూనియన్ నాయకులు శ్రీదేవి సునీత, కరుణ, సరళా దేవి ,ఉషశ్రీ ,రాధాకుమారి, ప్రియాంక, బుజ్జి, బి.పద్మ తదితరులు పాల్గొన్నారు.

గజపతినగరం : గర్భిణీలు, బాలింతలు, చిన్నపిల్లలకు, అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లకు ఫేస్ యాప్ రద్దు చేయాలని సిడిపిఒ కార్యాలయం వద్ద అంగన్వాడీలు ధర్నా చేశారు. అనంతరం సిడిపిఒ ఎం రాజేశ్వరికి వినతి అందజేశారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధ్యక్ష కార్యదర్శులు ఎం.సుభాషిని, పి.జ్యోతి మాట్లాడారు. ధర్నాకు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జి.శ్రీనివాస్ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సెక్టార్ లీడర్లు జి ముత్యాలు, పద్మ కళ, డి.నాగమణి, వై.నారాయణమ్మ, జి.సన్యాసమ్మ, డి .దమయంతి, తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి : ఎఫ్ఆర్ఎస్‌ను రద్దు చేయాలని బొబ్బిలి ఐసిడిఎస్ సిడిపిఒ కార్యాలయం వద్ద అంగన్వాడీ యూనియన్ ఆధ్వర్యాన ధర్నా చేశారు. అనంతరం సిడిపిఒకు వినతి అందించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు, అంగన్వాడీ యూనియన్ నాయకులు నిర్మల, పద్మ పాల్గొన్నారు.

బాడంగి : బాడంగి సిడిపిఒ కార్యాలయం ముందు అంగన్వాడీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అనంతరం సిడిపిఒకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎ.సురేష్, బి.శ్రీను, అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్.రవణమ్మ, లక్ష్మి, అరుణ, సీత, సత్యవతి పాల్గొన్నారు.

శృంగవరపుకోట : శృంగవరపుకోట ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు నిరసన చేపట్టారు. అనంతరం సిడిపిఒకి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు చెలికాని ముత్యాలు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

డెంకాడ : అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన ఫేసియల్ యాప్‌ను రద్దు చేయాలని అంగన్‌వాడీ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులు వి. లక్ష్మి డిమాండ్ చేశారు. సోమవారం భోగాపురం ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి బి సూర్యనారాయణ, మండల కన్వీనర్ పి.అనిత, భోగాపురం మండల కమిటీ మెంబరు ఎన్‌వి రమణ, అంగ న్వాడి భోగాపురం ప్రాజెక్టు నాయకులు ఎం. కృష్ణ, సెక్టర్ నాయకులు పి.అనిత, ప్రవీణ, సుజాత, వరలక్ష్మి, చిన్నమ్మలు, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

రాజాం: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఫేసియల్ యాప్‌ను రద్దు చేయాలని అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్, ఐసిడిఎస్ సెక్టార్ నాయకులు సుజాత, నిర్మల, సునీత తదితరులు పాల్గొన్నారు.



విజయనగరంలో ధర్నా చేస్తున్న అంగన్వాడీలు







గజపతినగరం, బొబ్బిలి, బాడంగి ఐసిడిఎస్ కార్యాలయాల వద్ద ధర్నాలు చేస్తున్న అంగన్వాడీలు, సిఐటియు నాయకులు



ధర్నా చేస్తున్న పిపిఎస్ఎస్ నాయకులు, రైతులు

కలెక్టర్ ఆదేశాలు రద్దు చేయాలి

రైతు బజారు అక్కడే కొనసాగించాలి ● కలెక్టరేట్ వద్ద రైతులతో పిపిఎస్ఎస్ ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పాత మహారాజ ఆసుపత్రి వద్ద ఉన్న రైతు బజారును అక్కడే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యాన సోమవారం కలెక్టరేట్ వద్ద రైతులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా పట్టణ పౌర సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి శంకరరావు మాట్లాడుతూ 26ఏళ్లగా ప్రభుత్వ స్థలంలో ఉన్న రైతు బజారును ఎత్తివేసి అన్నదాతలను రోడ్డున పడేయడం అన్యాయమని అన్నారు. వాస్తవానికి 2018లో రాష్ట్ర ప్రభుత్వం తరుపున చీఫ్ సెక్రటరీ ఇచ్చిన జీవోలో రైతు బజారు ఉన్న స్థలం సర్వే నెంబర్ 166/1 సంతపేట సౌత్ వార్డు 1.48 ఎకరాలు ఉందని తెలిపారు. ఈ స్థలం రాజులదని ఎటువంటి ఆధారాలూ లేవన్నారు. ఇది ప్రయివేట్ వారిది అయితే రైతు బజారు నిబంధనల ప్రకారం ప్రయివేటు వారి నుండి లీజు రాసుకోవాలని, కానీ అటువంటిదేమీ లేదన్నారు. ఇది ప్రభుత్వ స్థలం కాబట్టే 1999లో రైతు బజారు ఇక్కడ ఏర్పాటు చేశారన్నారు. 26 ఏళ్లుగా నెలకు రూ.3800 చొప్పుణ అద్దె కట్టుకుని రైతు బజారులో కూరగాయలు అమ్ముకుని జీవిస్తున్న 46 కుటుంబాలను ఎటువంటి ప్రత్యామ్నాయం చూపించకుండా, నోటీసులు ఇవ్వకుండా మార్కెటింగ్‌శాఖ ఎడి వెళ్లిపొమ్మనడం అన్యాయమని అన్నారు. అత్యవసరంగా కరెంట్ కట్ చేయడం సరైన పద్ధతి కాదన్నారు. అదే స్థలంలో రైతుబజారు కొనసాగించాలని, ఆయా కుటుంబాల జీవితాలుని కాపాడాలని కోరారు. సొంత స్థలం కేటాయించి రైతు బజారు నిర్మాణం చేపట్టాలని. అంత వరకు ఇక్కడ కొనసాగించాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతి అందజేశారు. ధర్నాలో ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు, సిఐటియు నగర కార్యదర్శి బి.రమణ, ఐద్వా జిల్లా కార్యదర్శి పి రమణమ్మ, రైతు బజార్ రైతులు పాల్గొన్నారు.

సివిల్ సప్లై పూర్వ డిఎంపై విచారణ

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

సివిల్ సప్లై పూర్వ డిఎం మీనాకుమారిపై విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ విచారణ ప్రారంభమైంది. ఆ విభాగం అధికారులు సోమవారం జిల్లా కేంద్రంలోని దాసన్నపేటలోగల సివిల్ సప్లై కార్యాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులను, కంప్యూటర్లలోని ఆన్‌లైన్ డేటాను పరిశీలించారు. గడిచిన మే నెలలలో జరిగిన డిఆర్‌సి సమావేశంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వంగలపూడి అనిత మీనా కుమారిపై అవినీతి ఫిర్యాదులు అందినట్టు తెలపడం, విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ విచారణకు ఆదేశించడం తెలిసిందే. ఎట్టకేలకు స్పందించిన విజిలెన్సు అధికారులు నాలుగు రోజుల క్రితమే సివిల్ సప్లై జిల్లా కార్యాలయాన్ని సందర్శించి, ధాన్యం కొనుగోలులో జరిగే సాధారణ ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. తాజాగా సోమవారం రికార్డులు, కంప్యూటర్లలోని డేటాను పరిశీలించడంతోపాటు వారి సందేహాలను కూడా స్థానిక అధికారులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.



కార్యాలయాన్ని పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

మంగళపాలెంలో రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జి

మంత్రి అచ్చెన్న హామీ

ప్రజాశక్తి-కొత్తవలస

మంగళపాలెం వద్ద రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి త్వరలోనే శంకుస్థాపన చేస్తామని వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నా యుడు హామీనిచ్చారు. మండలంలోని మంగళ పాలెంలో సోమవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారితో కలిసి జోరువానలో ఇంటింటికీ తిరిగారు. ఈ సందర్భంగా గ్రామస్తుల సమస్యలను తెలుసుకున్న అచ్చెన్న.. అక్కడి నుంచే కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడుతో ఫోన్లో మాట్లాడారు. త్వరలో గ్రామస్తులకు ఇబ్బందులు తొలగనున్నాయని, రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో డిసిఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కెబిఎ రాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను పంపిణీ చేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

27న అండర్-17 జిల్లా స్థాయి ఓపెన్ చెస్ పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 27న జిల్లా స్థాయి అండర్-17 ఓపెన్, బాలికల చెస్ పోటీలు నిర్వహిస్తామని చదరంగం అసోసియేషన్ కార్యదర్శి కెవి జ్వాలాముఖి తెలిపారు. ఈ పోటీలు చెస్ అసోసియేషన్ ఆఫ్ విజయనగరం, ఫైర్ చెస్ స్కూల్ ఆధ్వర్యాన నిర్వహిస్తామని తెలిపారు. అండర్-17 క్రీడాకారులు 2008 జనవరి 1 తరువాత పుట్టిన పిల్లలు అర్హులని, తప్పనిసరిగా జనన ధ్రువీకరణ పత్రం తేవాలని సూచించారు. ఈ పోటీలలో ఓపెన్‌లో ఇద్దరు క్రీడాకారులను, బాలికలలో ఇద్దరిని ఎంపిక చేసి ఆగస్ట్-16,17తేదీల్లో కాకినాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతామని తెలిపారు. పూర్తి వివరాలకు apchess.org websiteలోను, పేర్లు నమోదుకు 9703344488 నెంబర్‌లోను సంప్రదించాలని తెలిపారు.

మా భూములు మాకు అప్పగించండి

పిజిఆర్ఎస్‌కు 178 వినతులు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

జిల్లాలో పలు ప్రాంతాల్లో ఉన్న భూములను అక్రమించారని, మా పేరున ఉన్న భూములు వేరే వ్యక్తుల పేరున రికార్డుల్లో ఎక్కించారని పలువురు ఫిర్యాదు చేశారు. ప్రజా వినతుల పరిష్కార వేదికకు వచ్చే అర్జీదారుల వినతులను వారు సంతృప్తి చెందేవిధంగా సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో జిల్లా కలెక్టర్ తో పాటు జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్, డిప్యూటీ కలెక్టర్ మురళీ, ప్రమీలా గాంధీ ప్రజల నుండి వినతుల స్వీకరించారు. మొత్తంగా 178 వినతులు అందాయి. వాటిలో భూ సమస్యలకు సంభందించి రెవిన్యూ శాఖకు అత్యధికంగా 86 వినతులు వచ్చాయి. గరివిడి మండలం తాటిగూడ గ్రామంలో ఉన్న నాలుగున్నర ఎకరాల భూమి ఆర్మీ వాళ్లకు కేటాయిస్తే ఆ భూమిని వేరే వ్యక్తి ఆక్రమించారని వెంకట జగన్నాథ అనే వ్యక్తి గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. భోగాపురం మండల కేంద్రంలో 54 సెంట్లు భూమి వేరే వాళ్ళ పేరు మీద నమోదైందని నారాయణరావు గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేశారు. అయ్యన్నపేట ప్రాంతానికి చెందిన సామంతుల త్రినాథరావు తల్లి పేరున ఉన్న భూమి వేరే మహిళ పేరున నమోదయ్యిందని ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలు వెంటనే పరిష్కరించాలని తెలిపారు.



అర్జీని పరిశీలిస్తున్న కలెక్టర్ అంబేద్కర్

బిసి వసతిగృహాల సమస్యలు పరిష్కరించాలి

జిల్లాలో బిసి వసతి గృహాల సమస్యలను పరిష్కరించాలని, అనుమతులు లేకుండా నడుస్తున్న ట్యూషన్‌సెంటర్లపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ నాయకులు సోమవారం స్పందన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్‌కు వినతి అందజేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.రాము, సిహెచ్ వెంకటేష్ మాట్లాడుతూ సంక్షేమ హాస్టల్లో పరిస్థితి అగమ్యగోచరంగా ఉందని , వాటి సమస్యలు పరిష్కారం చేయాలని కోరారు. ప్రధానంగా పూసపాటి రేగ మండలంలో బిసి కాలేజి హాస్టల్‌లో పరిస్థితి దారుణంగా ఉందన్నారు. తాగడానికి మురుగునీరే గతి అన్నారు. భోగాపురం మండలంలో శిథిలావస్థకు చేరుకోవడంతో వందకు పైగా ఉన్న విద్యార్థుల సంఖ్య 20కు పడిపోయిందన్నారు. తక్షణమే జిల్లా బిసి వెల్ఫేర్ అధికారి ఆ హాస్టల్ నిర్మాణానికి నిధులు విడుదల చేసి నిర్మాణం ప్రారంభించాలని డిమాండ్ చేశారు. నగరంలో అనుమతులు లేకుండా నవోదయ, సైనికస్కూలు ప్రవేశ పరీక్షల కోచింగ్ సెంటర్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయని, వాటిపై చర్యలు తీసుకోవాలని కోరారు. వినతినిచ్చిన వారిలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు జె.రవికుమార్, సహాయ కార్యదర్శి పి రమేష్, కె.రాజు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాల్సిందే

కమిషనర్ నల్లనయ్య

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అభివృద్ధి పనులు పూర్తి నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాల్సిందేనని కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. సోమవారం నగరంలో పలు ప్రాంతాల్లో పర్యటించి, అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. గౌడవీధిలో సిసి రహదారి, కాలువ నిర్మాణ పనులను గమనించారు. అనంతరం పారిశుధ్య విధానాన్ని పరిశీలించారు. అనంతరం అన్న క్యాంటీన్‌ను సందర్శించారు.

వినతులు స్వీకరణ

నగరపాలక సంస్థ కార్యాలయంలో పిజిఆర్ఎస్‌లో కమిషనర్ నల్లనయ్య వినతులు స్వీకరించారు. టౌన్ ప్లానింగ్, ప్రజారోగ్య విభాగాలకు చెరొకటి, ఇంజినీరింగ్ విభాగానికి రెండు అర్జీలు అందాయి. సమస్యల పరిష్కారానికి వెంటనే చొరవ చూపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

అక్రమ నిర్మాణాలపై ఉపేక్షించేది లేదు

అక్రమ నిర్మాణాలను ఉపేక్షించబోమని కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టంచేశారు. ఆయన ఆదేశాలతో బందిలగూడెంలో నిర్మిస్తున్న అదనపు భవన నిర్మాణాన్ని ప్రణాళికా సిబ్బంది అడ్డుకున్నారు. అనుమతులు లేకుండా ఉన్న నిర్మాణాలను తొలగించారు. నిర్మాణ సామగ్రిని తరలించారు.



కొత్తగా నిర్మించిన సిసి రోడ్డును పరిశీలిస్తున్న కమిషనర్

పాత భవనాలకు నోటీసులు : కమిషనర్

వర్షాల వల్ల సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తగా పురాతన భవనాలకు నోటీసులు అందించాలని ప్రణాళిక సిబ్బందికి, సచివాలయ కార్యదర్శులకు నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాలు వల్ల పురాతన భవనాలు కూలిపోయే అవకాశం ఉందని అన్నారు. ముందస్తు జాగ్రత్తగా పాత భవనాలను, నిర్మాణాలను గుర్తించి నోటీసులు అందించి అప్రమత్తం చేయాలని అన్నారు. సమావేశంలో అసిస్టెంట్ సిటీ ప్లాన్ హరిబాబు, టిపీఓ అప్పలరాజు, టిపిఎస్ అనిత పాల్గొన్నారు.

ఊట బావుల పరిశీలన

నగర ప్రజలకు సురక్షితమైన తాగునీటి అందించేందుకు అవసరమైన అన్ని చర్యలను తీసుకుంటున్నామని కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. ఆయన ఆదేశాలతో ఇఇ ప్రసాదు, ఇతర ఇంజనీరింగ్ సిబ్బంది మధుపాడ ఊట బావుల వద్దకు వెళ్లి పరిస్థితులను గమనించారు. కురుస్తున్న వర్షాలకు కొత్తనీరు వచ్చి చేరుతున్నట్లు గుర్తించారు. నీటిని శుభ్రపరచి సురక్షితమైన నీటిని అందించేందుకు గల అవకాశాలపై సమాలోచనలు చేశారు.

లిక్కర్ స్కామ్‌పై ఇడి దర్యాప్తు చేయాలి

లోక్ సత్తా రాష్ట్ర అధ్యక్షులు భీశెట్టి బాబ్జి

ప్రజాశక్తి - కంటోన్మెంట్

మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి హయాంలో సుమారు 3,500 కోట్ల రూపాయల వరకూ మద్యం, అమ్మకాలు కొనుగోలుకు కమీషన్లు వసూళ్ళ చేసి పెద్దలు పంచుకు తిన్నట్టు ప్రత్యేక దర్యాప్తు బృందం తేల్చిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థ ఇడి తన పరిధిలోకి ఈ కేసును తీసుకోవాలని లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి కోరారు సోమవారం పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రాజకీయ క్షేత్రంలో కీలక అవినీతికి లిక్కర్ స్కాములు కేరాఫ్‌గా మారుతున్నాయని, ప్రధానంగా అధికారంలో ఉన్నవారికి మద్యం ఒక లిక్విడ్ గోల్డ్ మైన్‌గా మారుతుందని అన్నారు. కొందరు ఉన్నతాధికారులు వ్యవస్థీకృత దోపిడీలకు అడ్డగోలు సహాయం అందిస్తున్నారని అన్నారు. ,ఢిల్లీ, చతీస్ ఘడ్,తో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఈ జబ్బు పాకిందని, జగన్ జమానాలో జరిగిన మద్యం కుంభకోణంపై ఇడి దృష్టి సారించాలని కోరారు. మద్యం కుంభకోణంలో పాత్రధారుల, సూత్ర దారుల ముసుగులు తొలగించి ప్రజల ముందు వాస్తవాలు పెట్టాలని భీశెట్టి అన్నారు. సమావేశంలో పార్టీ సీనియర్ నాయకుడు కాంగ్రేగుల ప్రసాద్,పౌర వేదిక ఉపాధ్యక్షుడు తుమ్మగంటి రామ్మోహన్ రావు, యాగాటి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి సూక్ష్మరుణ ప్రణాళికలు

ప్రజాశక్తి-విజయనగరంకోట

పొదుపు సంఘాల సభ్యుల ఆర్థికఅవసరాలు, వారి ఆర్థికాభివృద్ధికి సెర్ప్ నుండి కొత్తగా ఆన్ లైన్ ద్వారా సూక్ష్మరుణ ప్రణాళిక (మైక్రో క్రెడిట్ ప్లాన్), ఎసిఎల్‌పి పథకాలు అమలు చేస్తున్నామని డిఆర్‌డిఎ పీడీ కె.సావిత్రి చెప్పారు. కలక్టరేట్ సమావేశపు మందిరంలో జిల్లా స్థాయి అధికారులకు వెలుగు-డిఆర్‌డిఎ ద్వారా అమలు జరుగుతున్న పథకాలు, కార్యక్రమాలను ఆమె వివరించారు. సంఘాలకు బ్యాంక్ లింకేజి, స్త్రీ నిధి, ఉన్నతి ద్వారా అధిక మొత్తంలో రుణాలు ఇచ్చామన్నారు. ఈ రుణాలను ఒక క్రమ పద్ధతిలో, సభ్యుల అవసరాల మేరకు అవసరమైన మొత్తం ఎంసిపి ద్వారా సంఘ సభ్యుల ఆర్థిక అభివృద్ధికి అవకాశం కల్పించి, వారి జీవనోపాధులు పెంపొందించడం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఎసిఎల్‌పి ద్వారా ఈ ఏడాది సుమారు 1.25లక్షల మంది చదువుకున్న సంఘ సభ్యులకు శిక్షణ ఇచ్చి, వారి ఆర్థిక అవసరాలు, ఆన్ లైన్ అప్లికేషన్‌లో నమోదు చేస్తామని తెలిపారు. వ్యవసాయ శాఖ, ఉద్యానశాఖ, పట్టుశాఖ, పశు సంవర్ధక శాఖ, మత్స్యశాఖ, ఫుడ్ ప్రోసెసింగ్ మొదలగు శాఖలు వారి వార్షిక సుస్థిర జీవనోపాధులు సంఘ సభ్యుల ద్వారా చేపట్టేందుకు సెర్ప్‌తో సమన్వయం చేసుకోవడానికి గ్రామ, జిల్లా స్థాయి కమిటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామ స్థాయి కమిటీ ద్వారా వచ్చిన లబ్దిదారుల వివరాలను నిబంధనల మేరకు జిల్లా స్థాయి కమిటీ పరిశీలించి ఆమోదించాల్సి ఉంటుందని తెలిపారు.

బాలికలపై అసభ్య ప్రవర్తన

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

ప్రజాశక్తి -బొబ్బిలిరూరల్

విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయుడు బాలికలపై అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో జిల్లా విద్యా శాఖ అధికారి.. ఆ ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ వేటువేశారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ సంఘటన మండలంలోని నారసింహునిపేట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో చోటుచేసుకుంది.

మండలంలోని నారసింహునిపేట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయులుగా పని చేస్తున్న యర్రా శ్రీనివాస్... నలుగురు బాలికలపై అసభ్యకరంగా ప్రవర్తించారు. దీంతో ఆ బాలికల తల్లిదండ్రులు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఎంఇఒ, డిఇఒలకు ఫిర్యాదుచేశారు. వారు దర్యాప్తు నిర్వహించి ఈ నెల 18న సస్పెన్షన్ ఉత్తర్వులు జారీచేశారు. దర్యాప్తు సజావుగా నిర్వహించేందుకు హెడ్ క్వార్టర్స్ విడిచి వెళ్లద్దని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఉత్తమ వైద్య సేవలకు ప్రశంసలు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

వైద్యారోగ్య శాఖలో ఉత్తమ సేవలను అందించిన డాక్టర్లు, సిబ్బందిని జిల్లా కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ అభినందించారు. తమ ఛాంబర్లో సోమవారం ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ నెల 11న జరిగిన అంతర్జాతీయ జనాభా దినోత్సవం సందర్భంగా, వైద్య శాఖలో విశేష ప్రతిభ కనబరిచిన వారిని ప్రశంసా పత్రాలకు లక్కీడిప్ ద్వారా ఎంపిక చేశారు. ఎంపికైన వైద్యాధికారులు, సిబ్బందికి కలెక్టర్ ప్రశంసా పత్రాలను, నగదు బహుమతి క్రింద చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మరింత మెరుగైన సేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. పిపిఐయు సిడిలు ఎక్కువమందికి వేసినందుకుగాను చీపురుపల్లి ఏరియా ఆసుపత్రిలో పనిచేస్తున్న గైనకాలజిస్ట్ డాక్టర్ ఉషారాణికి రూ. 8వేలు, ఎక్కువ వేసెక్టమీ శస్త్ర చికిత్సలు నిర్వహించిన పోలిపల్లి పిహెచ్‌సి డాక్టర్ టి.తిరుపతి స్వామికి రూ. 7వేలతోపాటు ప్రశంసా పత్రాలను కలెక్టర్ అందజే శారు. ఆర్ఎంఎన్‌సిహెచ్ఎ కౌన్సిలర్ ఎ.నాగమణి, మోటివేటర్ ఎస్.గమ్య, ఎం.ఎరుకలమ్మకు రూ. 2,500 చొప్పున నగదు బహుమతిని, ప్రశంసా పత్రాలను అందజేశారు. ముగ్గురు పిల్లలకంటే ఎక్కువ ఉన్న చంద్రకళ, ఈశ్వర్రావు దంపతులు, ఈడ పైడితల్లి, సన్యాసిరావు దంపతులు, కోరాడ సునీత, వెంకటరమణ దంపతులు, హేమలత, మహేష్ దంపతులకు, వేసెక్టమీ యాక్సెప్టర్ అడపా సురేష్, ఎన్‌జెక్టబుల్ యాక్సెప్టర్ వానపల్లి రమ్యకు రూ. 5,000 చొప్పున నగదు బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్ జీవన రాణి, ఇంచార్జి గణాంకాధికారి సంధ్యారాణి, డెమో వి.చినతల్లి తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్‌హెచ్‌పి గమ్యకు ప్రశంసాపత్రం

వేపాడ : వేపాడ పిహెచ్‌సి పరిధిలోని జాకేరు వెల్‌నెస్ సెంటర్‌లో ఎంఎల్‌హెచ్‌పిగా సేవలందిస్తున్న ఎస్.గమ్యకు కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ ప్రశంసాపత్రం అందించారు. ఎంఎల్‌హెచ్‌పిగా ఉత్తమ సేవలు అందించిన వారికి ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ప్రశంసాపత్రాలను ప్రదానం చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో ఆమెకు కలెక్టర్, డిఎంహెచ్ఒ జీవనరాణి ప్రశంసాపత్రాన్ని అందించి, అభినందించారు.



గమ్యకు ప్రశంసాపత్రాన్ని అందిస్తున్న కలెక్టర్ అంబేద్కర్

నెల్లిమర్ల కమిషనర్‌గా జయరాం

ప్రజాశక్తి - నెల్లిమర్ల



నెల్లిమర్ల నగర పంచాయతీ కొత్త కమిషనర్‌గా టి.జయరాం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ మేనేజర్‌గా పనిచేస్తున్న ఆయనను కమిషనర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ కావడంతో సోమవారం ఆయన స్థానిక కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ జయరాం మాట్లాడుతూ అందరి సహకారంతో నగర పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

రెండు రోజులు తాగునీరు బంద్

ప్రజాశక్తి - చీపురుపల్లి

పట్టణంలో పైప్‌లైన్లు రిపేర్లు కారణంగా రెండు రోజులపాటు కుళాయిల ద్వారా వచ్చే తాగునీరు సరఫరా ఉండదని శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్, సూపర్‌వైజర్ ఎస్.రామ్మోహన్ తెలిపారు. పట్టణ పరిధిలోని సంతానలక్ష్మి ఆలయం సమీపంలో నుండి పాత కూరగాయల మార్కెట్ మీదుగా పోలీస్ స్టేషన్ రోడ్‌లో గల రేగిడివీధి ప్రాంతాలకు పైపులైను మరమ్మత్తులు కారణంగా తాగునీటి సరఫరా నిలిపి పోవడంతో ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టామని తెలిపారు. ఈ రెండు రోజులపాటు చీపురుపల్లి మేజర్ పంచాయతీ నుండి వాటర్ ట్యాంకుల ద్వారా సోమవారం నుంచి నీటి సరఫరాను అందజేస్తున్నామన్నారు.

విధుల్లో నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

విధులు సక్రమంగా నిర్వహించని సచివాలయ ఉద్యోగులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పిసిసి సభ్యులు ముద్దులు శ్రీనివాసరావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రజా వద్దకు పాలన అందించేందుకు సచివాలయ వ్యవస్థను తీసుకుని వచ్చినా ఉద్యోగులు సక్రమంగా పని చేయక పోవడంతో ఆ లక్ష్యం నెరవేరడం లేదని చెప్పారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

బిఆర్‌పాలెం రోడ్డుకు రూ.2.40 కోట్లతో ప్రతిపాదనలు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని ఆతవ నుంచి భూమిరెడ్డి పాలెం గ్రామానికి రోడ్డు నిర్మాణానికి రూ.2.40 కోట్లతో అధికారులు ప్రతిపాదనలు పంపించారు. ఈ గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించాలని పిసిసి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ అంబేద్కర్‌కు ఇటీవల సామాజిక కార్యకర్త రెడ్డి అప్పారావు వినతి పత్రం అందించారు. ఆయనకు కలెక్టర్ స్పందించి డ్వామా పీడీకి ఆదేశాలు జారీ చేశారు. పీడీ ఆదేశాల మేరకు పిఆర్ జెఇ ఆర్ రూ.2.40 కోట్లతో అంచనా వేసి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వీటిని ఆమోదం కోసం కలెక్టర్‌కు పంపించినట్లు ఎంపిడిఒ సి.హెచ్ సూర్యనారాయణ తెలిపారు.

విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - రేగిడి

మండలంలోని లింగాలవలస జిల్లా పరిషత్తు పాఠశాలకు క్రీడాదుస్తులను సోమవారం పంపిణీ చేశారు. సంతకవిటి మండలం సిరిపురం గ్రామానికి చెందిన క్రీడాభిమాని బి.సన్యాసిరావు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు సన్నిబాబు ద్వారా విద్యార్థులకు 4,500 విలువ గల క్రీడా దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. విద్యార్థులకు ఈ దుస్తులు అందజేయడం పట్ల ప్రధానోపాధ్యాయులు దాసరి కృష్ణారావు, ఉపాధ్యాయ సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, నాన్ టీచింగ్ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

పి4 గ్రామసభ పరిశీలన

వేపాడ : మండలంలోని జాకేరు గ్రామంలో సోమవారం ఏర్పాటుచేసిన పి4 గ్రామసభను ప్రత్యేకాధికారి పి.బాలభాస్కరరావు సందర్శించారు. గ్రామసభలో తీసుకున్న నిర్ణయాలపై ఆయన ఆరాతీశారు. ఈ సందర్భంగా గ్రామ నాయకులు బుద్ద అప్పలనాయుడు మాట్లాడుతూ గ్రామసభల నిర్వహణ వల్ల ప్రయోజనాలను వివరించారు.

మేలైన యాజమాన్య పద్ధతులపై శిక్షణ

ప్రజాశక్తి-శృంగవరపుకోట

పిఎంఆర్‌కెవివై పథకంలో భాగంగా పంటలలో చేపట్టాల్సిన మేలైన యాజమాన్య పద్ధతులపై రైతు సేవా కేంద్రాల సిబ్బందికి సోమవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ ఎడి బి.భానులత మాట్లాడుతూ నారుమడి యాజమాన్యం, వరి పంటలో సమగ్ర సస్యరక్షణ గురించి వివరించారు. పచ్చిరొట్ట ఎరువుల ఆవశ్యకత, నవధాన్యాలు భూమికి చేసే మేలుపై తెలియజేశారు. పంటల బీమా కింద వరి ఎకరానికి రూ.200 ఆగస్టు 15లోగా చెల్లించాలని చెప్పారు. ఏరువాక కేంద్రం సమన్వయకర్త కె.లక్ష్మణరావు, ఆర్.వి స్వామి నాయుడు, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి పి.నిర్మల మాట్లాడారు.

విద్యార్థులకు ఉచిత దంత, కంటి పరీక్షలు

విజయనగరం టౌన్ : రోటరీ క్లబ్ ఆధ్వర్యం లో సోమవారం పూల్‌బాగ్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సుమారు 150 మంది విద్యార్థులకు ఉచిత దంత, కంటి పరీక్షలు నిర్వహించారు. వి డెంటల్ కేర్, పుష్పగిరి కంటి వైద్య నిపుణులు నిర్వహించిన ఈ పరీక్షల్లో రోటరీ క్లబ్ విజయనగరం అధ్యక్షులు బివి శ్రీనివాస రావు, కార్యదర్శి బి. రాధికారాణి, సూర్యలక్ష్మి, సుధాకర్, మురళీకృష్ణ , ఉమ బాలాజీ, సాంబశివరావు, నీతా విజ్వని, చిన్నమస్తాన్‌రావు, స్కూల్ ఇంఛార్జి హెచ్‌ఎం డి.ఈశ్వరరావు, వి.కృష్ణ , సుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు.

సీతం విద్యార్థుల పారిశ్రామిక సందర్శన

ప్రజాశక్తి-విజయనగరం

విశాఖపట్నంలోని ఇండియన్ బయో మెడికల్ స్కిల్ కన్సోర్టియం (ఐబిఎమ్‌ఎస్‌సి)ను సీతం కళాశాల ఇసిఇ విద్యార్థులు సోమవారం సందర్శించారు. పారిశ్రామిక సందర్శనలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టారు. వైద్య పరికరాల డిజైన్, తయారీ గురించి తెలుసుకున్నారు. ఎక్స్-రే ఉత్పత్తి, రేడియోగ్రఫీ, ఫ్లోరోస్కోపీ, ఎక్స్-రే యంత్రాలలో ఉపయోగించే సాంకేతికత, ఎక్స్-రే పరికరాల సంస్థాపన, తదితర అంశాలను తెలుసుకున్నారు.

రాష్ట్ర కార్యదర్శికి సైకిల్ అందించిన అశోక్

ప్రజాశక్తి-విజయనగరంకోట

గోవా గవర్నర్‌గా నియమితులైన కేంద్రమాజీ మంత్రి పి.అశోక్‌గజపతిరాజు తాను వివిధ సందర్భాల్లో వినియోగించిన సైకిల్‌ను తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి మద్దిల ప్రవీణ్‌కు సోమవారం అందజేశారు. గతంలో ఆయనకు పార్టీ కార్యకర్తలు ఇచ్చిన ఆ సైకిల్ ను పార్టీ కార్యక్రమాలకు ఉపయోగపడే విధంగా ఉండాలనే ఉద్దేశంతో ప్రవీణ్‌కు అప్పగించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన సైకిల్ యాత్రలో ఈ సైకిల్‌ను అశోక్‌గజపతిరాజు ఉపయోగించారు.

ఘనంగా ఖర్గే పుట్టినరోజు వేడుకలు

విజయనగరం కోట : అఖిలభారత జాతీయ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే 83వ పుట్టినరోజు వేడుకలను సోమవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తల సమక్షంలో డిసిసి అధ్యక్షులు ఎం.విద్యాసాగర్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో విజయనగరం నియోజకవర్గ ఇన్చార్జ్ శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు, ముస్లిం మైనార్టీ సెల్ చైర్మన్, పలు మండలాల పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు

అదనపు భవనం ఏర్పాటు చేయాలి

శృంగవరపుకోట : ప్రభుత్వ గిరిజన బాలుర వసతిగృహంలో అదనపు భవనం, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన తహశీల్దార్ శ్రీనివాసరావుకు సోమవారం వినతి అందించారు. 270 మందికి పైగా విద్యార్థులుంటే 10 మరుగుదొడ్లు మాత్రమే ఉన్నాయని చెప్పారు. గదులు చాలడం లేదని వివరించారు. తిలక్, చిన్న, శంకర్, చైతన్య పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి కేసులో ముగ్గురు అరెస్ట్

కంటోన్మెంట్ : శనివారం అర్ధరాత్రి కొత్తపేట జంక్షన్ వద్ద నడుచుకొని వెళు_న్న బొండపల్లి మండలం గుమడాంకు చెందిన రిటైర్డు ఎస్ఐ బుచ్చిరాజుపై దాడి చేసిన కేసులో ముగ్గురిని అరెస్టు చేసినట్లు టూటౌన్ సిఐ టి శ్రీనివాసరావు తెలిపారు. నిందితుల్లో నెల్లిమర్ల మండలం గరికిపేటకు చెందిన తాడ్డి ప్రవీణ్, తొంపల రాజేష్‌తో పాటు ఒక బాలుడు ను అరెస్టు చేసినట్లు

హామీలు అమలు చేయకుండా మోసం

బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమంలో వైసిపి మాజీ ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి-బొబ్బిలి

టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలకు ఎలాంటి సంక్షేమ పథకాలూ అందడం లేదని బొబ్బిలి మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు తెలిపారు. మున్సిపాలిటీలోని పాత బొబ్బిలిలో సోమవారం బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ఏడాది కాలంలో వివిధ సంక్షేమ పథకాలు అందక ప్రతి కుటుంబం ఎంత మోసపోయిందో వివరించారు. మోసం చేయడం చంద్రబాబు నైజమని విమర్శించారు. మరోసారి చంద్రబాబును నమ్మి ఓట్లు వేసి ప్రజలు మోసపోయారని చెప్పారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి శంబంగి వేణుగోపాలనాయుడు, పట్టణ అధ్యక్షులు చోడిగంజి రమేష్ నాయుడు, మున్సిపల్ మాజీ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, కౌన్సిలర్ కోట పెద రాములు, సీనియర్ నాయకులు తూముల భాస్కరరావు, ఇంటి గోపాలరావు, తదితరులు పాల్గొన్నారు.

పదే పదే మోసపోకండి : కోలగట్ల

విజయనగరం టౌన్ : మహిళలకు రూ.1500 ఇస్తామని, 50 ఏళ్లకే పెన్షన్ ఇస్తానని, మహిళలకు ఉచిత బస్సు కల్పిస్తామని చెబుతున్న టిడిపి నాయకుల కల్లబొల్లి కబుర్లు విని మోసపోకండి అని వైసిపి నాయకులు, మాజీ డిప్యూటీ స్పీకర్



కరపత్రాలను విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి

కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. 47వ డివిజన్ కంటోన్మెంట్ పరిధిలో బంగారమ్మ గుడి వద్ద నుంచి సోమవారం బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం సాగిస్తున్న మోసపూరిత పాలనను, ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చకుండా ప్రజలకు వస్తున్న టిడిపి నాయకులను నిలదీయాలని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, మున్సిపల్ ఫ్లోరల్ లీడర్ ఎస్‌వివి రాజేష్, నగర పార్టీ అధ్యక్షులు ఆశపు వేణు, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి సంగం రెడ్డి బంగారు నాయుడు, స్థానిక కార్పొరేటర్ పట్నాన పైడిరాజు, జోనల్ ఇన్చార్జులు దూబే, కాళ్ల సూరిబాబు, ఈశ్వర్ కౌశిక్, స్థానిక కార్పొరేటర్లు తాళ్లపూడి పండు, బొద్దూరు లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస : మండలంలోని ఉత్తరాపల్లి, చిన్నిపాలెం, అప్పన్నపాలెం పంచాయతీల్లో బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు చేపట్టారు. ఆయన ఇంటింటికి వెళ్లి టిడిపి కూటమి ప్రభుత్వం ఎగ్గొట్టిన వైసిపి పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో కొప్పల వెలమ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ, వైసిపి మండల అధ్యక్షులు ఒబ్బిన నాయుడు, సర్పంచులు సింగంపల్లి వెంకటలక్ష్మి, కోన దేముడు, రఘుడు పవన్, రామస్వామి, ఎం.అప్పలరాజు, చింతల పైడిం నాయుడు, వైఎస్ఆర్‌టియుసి జిల్లా అధ్యక్షులు సింగంపల్లి గణేష్, మాజీ సర్పంచులు దొగ్గ అప్పలనాయుడు, పావడ దాలయ్య, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు గొరపల్లి శివ, పల్ల భీష్మ, బోదల సురేష్, ఎంపిటిసి వెలగల వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

ఏడాదిలో అభివృద్ధి శూన్యం

దత్తిరాజేరు : టిడిపి కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో చేసిన అభివృద్ధి శూన్యమని మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య విమర్శించారు. బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా కోమటిపల్లి వద్ద ఉన్న లేఅవుట్‌లో వైసిపి విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. సూపర్ సిక్స్ హామీలను ఏ ఒక్కటీ సరిగా అమలు చేయలేదని, వీటిపై వైసిపి నాయకులు గ్రామాల్లోకి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో ఎంపిపి గేదెల సింహాద్రి అప్పలనాయుడు, జెడ్‌పిటిసి రౌతు రాజేశ్వరి, రైతు విభాగం జిల్లా అధ్యక్షులు మంత్రి అప్పలనాయుడు, బిసి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బమ్మిడి



టిడిపి ప్రభుత్వ హామీలపై కరపత్రాల ద్వారా వివరిస్తున్న కడుబడి శ్రీనివాసరావు

అప్పలనాయుడు, వైస్ ఎంపిపి ఎం.రమేష్, వైసిపి మండల అధ్యక్షులు రాపాక కృష్ణార్జున, యువజన విభాగం మండల అధ్యక్షులు దత్తి చిరంజీవి, నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షులు ఫణీంద్ర, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

ఇది దగా కోరు ప్రభుత్వం: బడ్డుకొండ

పూసపాటిరేగ : ఇది దగా కోరు ప్రభుత్వం అని ప్రజలను నమ్మించి మోసం చేసిందని మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు విమర్శించారు. రెల్లివలస, చల్లవానితోట, కుమిలి, బత్తివలస, చోడమ్మ అగ్రహారం, పూసపాటిరేగ, కొవ్వాడ గ్రామాల్లో సోమవారం బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు పథకాలపై ఆశపడి మోసపోయారనీ, అర్హులైన వృద్ధులకు కూడా పింఛన్లు అందించలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉందని విమర్శించారు. సంక్షేమ పథకాలను అరకొరగా అమలు చేస్తూ ప్రజలను దగా చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మహంతి కళ్యాణి, జెడ్‌పిటిసి సీతాలక్ష్మి, వైసిపి మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, అల్లాడి రమేష్, దాడిశెట్టి త్రినాధరావు, మహంతి జనార్ధన్ రావు, మహంతి శ్రీనివాసరావు, మహంతి లక్ష్మణరావు, టి.సీతారాం తదితరులు పాల్గొన్నారు.



అశోక్‌గజపతిరాజును కలసిన టిడిపి జిల్లా అధ్యక్షులు కిమిడి నాగార్జున

అశోక్‌ను కలిసిన నాగార్జున

ప్రజాశక్తి-విజయనగరంకోట

గోవా గవర్నర్‌గా నియమితులైన టిడిపి సీనియర్ నాయకులు, మాజీ కేంద్రమంత్రి పి.అశోక్‌గజపతిరాజును పార్టీ జిల్లా అధ్యక్షులు, డిసిసిబి చైర్మన్ కిమిడి నాగార్జున సోమవారం కలసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సుదీర్ఘ రాజకీయ జీవితంలో మచ్చ లేని నాయకుడు అశోక్ అని తెలిపారు. ఆయన నిజాయితీకి దక్కిన గొప్ప గౌరవం గవర్నర్ పదవి అని ప్రశంసించారు. రాష్ట్ర రాజకీయాలకే ఒక దిక్సూచి అన్నారు. ఆయన చూపించిన మార్గంలోనే నేడు అనేకమంది రాజకీయ నాయకులు వెళ్తున్నారంటే ఒక నిబద్ధత నిదర్శనత ఎంత గొప్పదో తెలుస్తుందన్నారు. కేంద్రంలో బెస్ట్ పార్లమెంటేరియన్ అవార్డు పొందిన నాయకుడు అశోక్ గజపతిరాజు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్లకు జీతాలు చెల్లించాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్

ప్రజాశక్తి- రేగిడి


గ్రీన్ అంబాసిడర్లులకు పెండింగ్ జీతభత్యాలు తక్షణమే విడుదల చేసి వారి కుటుంబాలను ఆదుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె. సురేష్ డిమాండ్ చేశారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించి ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామాల్లో తడి, పొడి చెత్తలను వేరు చేసి వాటిని గ్రామ శివారులో ఉన్న సంపద సృష్టి కేంద్రాలకు గ్రీన్ అంబాసిడర్లు తీసుకువెళ్లి వేయడం పట్ల గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపడుతుందన్నారు. అటువంటి అంబాసిడర్లకు పెండింగ్‌లో ఉన్న జీతాలు తక్షణమే అందించాలని డిమాండ్ చేశారు. పని చేసిన వారందరికీ గ్లౌజులు, షూష్, యూనిఫామ్స్, రక్షణ పరికరాలు ప్రభుత్వం అందజేయాలన్నారు. గ్రామ పంచాయతీలను పరిశుభ్రంగా ఉంచుతున్న గ్రీన్ అంబాసిడర్లకు గత ఏప్రిల్ నుండి 12 నెలలు జీతభత్యాలు బకాయిలు ఉన్నాయని వెంటనే చెల్లించాలని అన్నారు. అంబాసిడర్లకు కేవలం నెలకు రూ.6వేలు మాత్రమే జీతభత్యాలు ఇస్తున్నారని, అవి కూడా ప్రతినెల ఇవ్వకుండా బకాయిలు ఉంచి కార్మిక కుటుంబాలను పస్తులతో ఉండే విధంగా చేస్తున్నారని అన్నారు. ప్రస్తుత వర్షాకాలం ప్రారంభమైందని, ఇటువంటి పరిస్థితుల్లో వీరి సేవలు చాలా కీలకమని గుర్తు చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా జీతం రూ.10వేలకు వెంటనే పెంచాలని, రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యతపడి జీతాలు నేరుగా కార్మికుల అకౌంట్‌లో వేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఇంఛార్జి ఎంపిడిఒ నాగమణికి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందించారు.. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ ఎం. త్రినాథ్, గ్రీన్ అంబాసిడర్స్ యూనియన్ నాయకులు కే.పెంటయ్య, సత్యం, సింహాచలం, సత్తిరాజు, సాంబయ్య, దాలయ్య, అప్పన్న, సూరి పాల్గొన్నారు.

మెకానిక్‌ల సమస్యలు పరిష్కరించండి

ఎమ్మెల్యే కళా వెంకటరావుకు వినతి

ప్రజాశక్తి - చీపురుపల్లి

ద్విచక్ర వాహన మెకానిక్‌లుగా పనిచేస్తూ పలు ఇబ్బందులకు గురవుతున్న తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చీపురుపల్లి మెకానిక్‌ల వెల్ఫేర్ అసోసియేషన్, జనసేన నాయకుడు కోట్ల కృష్ణ ఆధ్వర్యంలో సోమవారం ఎమ్మెల్యే కిమిడి కళా వెంకట్రావుకు వినతి పత్రాన్ని అందజేశారు. నియోజకవర్గంలో సుమారు 200 మంది ద్విచక్ర వాహనాల మెకానిక్‌లుగా పనిచేస్తున్నామన్నారు. ఉదయం నుండి రాత్రి 12 గంటల వరకు ఎంత పని చేసినప్పటికీ తమ కుటుంబాలను పోషించుకునే విధంగా ఆదాయం రావడంలేదని వివరించారు. ద్విచక్ర వాహన అసోసియేషన్ వెల్ఫేర్ భవన్ నిర్మాణం కోసం స్థలాన్ని కేటాయించడంతో పాటు తాము ఆర్థికంగా నిలదొక్కుకొని తమ కుటుంబాలను పోషించుకునే విధంగా ప్రభుత్వం సహాయం అందించాలని కోరారు. మెకానికల్ సమస్యలను విన్న ఎమ్మెల్యే కళా వెంకట్రావు స్పందించి తగు న్యాయం చేసేందుకు తన వంతు సహకారాన్ని అందిస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చీపురుపల్లి, గరివిడి, మెరకముడుదాం మెకానిక్ అసోసియేషన్ అధ్యక్షులు పోతుల రాము, గడి నాని, ఉపాధ్యక్షులు కూనుబిల్లి రామ లక్ష్మణ, సారికి త్రినాధరావు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కళావెంకటరావును వినతినిస్తున్న మెకానిక్‌లు

పలుచోట్ల కేంద్ర బృందం పర్యటన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని సోంపురం గ్రామంలో సోమవారం కేంద్ర బృందం పర్యటించింది. ఇంటింటికీ వెళ్లి మరుగుదొడ్లను, గ్రామంలో డ్రెయిన్లను కేంద్ర బృందం సభ్యులు విజయకుమార్ పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్లను సందర్శించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ వి.దేవి, స్వచ్ఛ కోఆర్డినేటర్ రాంబాబు, పంచాయతీ కార్యదర్శి కృష్ణారావు, ఇఒపిఆర్‌డి రవి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ విమల, ఎఎన్‌ఎం శాంతి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షన్ పై కేంద్ర సర్వే బృందం పరిశీలన

రేగిడి : మండలంలోని పెద్దపుర్లి, చిన్నపుర్లి గ్రామ పంచాయతీలలో స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ 2025 కేంద్ర బృందం సర్వే సభ్యులు సోమవారం పరిశీలించారు. మురుగు నీటి కాలువల నిర్వహణ, మరుగుదొడ్ల వాడకం, ఇంటింటి చెత్త సేకరణపై ప్రజల నుండి అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయం, అంగన్వాడీ కేంద్రం, చెత్త నుండి సంపద తయారీ కేంద్రం తనిఖీ చేసి వసతులపై ఆరా తీశారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తదితర వాటిని పరిశీలించారు. బహిరంగ ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచాలని, ప్లాస్టిక్ వాడకం తగ్గించుకోవాలని ప్రజలకు సూచించారు. వీరితోపాటు గ్రామీణ నీటి సరఫరా జెఇ జి.శ్రీ చరణ్, ఇఒపిఆర్‌డి కెవివి జగన్నాథరావు, స్వచ్ఛ భారత్ మండల కో ఆర్డినేటర్ పద్మ, ఎర్నేన సుగుణ, రామినాయుడు, పంచాయతీ కార్యదర్శులు హేమసుందర రావు, గోపాలనాయుడు, వై.రమ, జోషికిరణ్ ఉన్నారు.

టిడిపితోనే సంక్షేమం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-విజయనగరం కోట

టిడిపి ప్రభుత్వంతోనే అభివృద్ధి, సంక్షేమం ప్రజలకు అందుతాయని ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా 10,11 డివిజన్ల పరిధిలో ఎమ్మెల్యే పర్యటించారు. ఇంటింటికి వెళ్లి టిడిపి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. తల్లికి వందనం అమలుతో తల్లుల కళ్లల్లో ఆనందం చూస్తున్నామని అన్నారు. ఎన్టీఆర్ భరోసా ద్వారా పింఛన్ల మొత్తం పెంచిన ఘనత తమదే అన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు పలు కంపెనీలను మన రాష్ట్రానికి తీసుకొస్తున్నారని తెలిపారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ పార్టీ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, కార్యదర్శి బంగారు బాబు, టిడిపి నాయకులు గంటా రవి తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

గాయపడిన హెడ్ కానిస్టేబుల్ మృతి

ప్రజాశక్తి- డెంకాడ

గత నెల 23వ తేదీన చింతలవలస 5వ బెటాలియన్ మెయిన్ గేట్ ఎదురుగా కారు ఢీకొని బెటాలియన్‌లో ఉద్యోగం చేస్తున్న హెడ్ కానిస్టేబుల్ కోరాడ రామునాయుడు తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన సోమవారం మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం.. గత నెల 23వ తేదీన ఉద్యోగం నిమిత్తం బెటాలియన్‌కి మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా మెయిన్ గేట్ ఎదురుగా విజయనగరం నుంచి విశాఖపట్నం వెళ్తున్న కారు బలంగా ఢీకొనడంతో రామనాయుడు తలకు, కాళ్లకు చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో వెంటనే అపస్మారక స్థితిలోనికి వెళ్ళిపోయారు. గేటు వద్ద ఉద్యోగం చేస్తున్న తోటి సిబ్బంది వెంటనే విశాఖపట్నం ప్రైవేట్ ఆసుపత్రికి కారులో తరలించారు. ఆ రోజు నుంచి కోమాలో ఉండి శిక్ష పొందుతూ మరణించారు. ఆయనకు భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సెల్‌ఫోన్ దొంగకు 5నెలల జైలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

రైల్లో సెల్ ఫోన్ దొంగతనం చేసిన వ్యక్తికి విశాఖ రైల్వే కోర్టు మేజిస్ట్రేట్ అనురాగ్ ఐదు నెలల జైలు శిక్ష విధించినట్లు విజయనగరం రైల్వే పోలీస్ ఎస్ఐ వి. బాలాజీ రావు తెలిపారు. గత ఏడాది రైలులో ప్రయాణిస్తున్న వ్యకి సెల్ ఫోన్ దొంగతనాలు జరగగా, జిఆర్‌పి ఎస్ఐ వి.బాలాజీరావు కేసు దర్యాప్తులో భాగంగా ఎస్.కోట మండలం సీతారామపురం గ్రామానికి చెందిన గొల్లు దినేష్ కుమార్‌ను అరెస్ట్ చేసి సెల్ ఫోన్‌ను రికవరీ చేశారు. నేరం రుజువు కావడంతో ఏడాది జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

మహిళపై హత్యాయత్నం

ప్రజాశక్తి- కంటోన్మెంట్

నగరంలోని జొన్నగుడ్డికి చెందిన బంగారు భవానిపై సోమవారం వేకువజామున పొట్నూరు తరుణ్ అనే వ్యక్తి కత్తితో దాడి చేశాడు. వెంటనే కుటుంబ సభ్యులు భవానిని జిల్లా ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం ఆమెను విశాఖ కెజిహెచ్‌కు తరలించారు. భవాని అక్క మాలతి ఇచ్చిన మేరకు కేసు నమోదు చేసినట్లు సిఐ చౌదరి తెలిపారు

పాముకాటుతో మహిళ మృతి

ప్రజాశక్తి- మెంటాడ

మెంటాడ సంతతోట వద్ద పాముకాటుతో ఓ మహిళ మృతి చెందింది. మెంటాడకు చెందిన వి.ప్రభావతి (60) సంతలో సోమవారం గాజుల వ్యాపారం చేసుకుంటోంది. ఇంతలో చిన్నపాటి వర్షం పడటంతో పక్కనే ఉన్న పాకలో తల దాచుకునేందుకు వెళ్లగా, ఏదో పాము వచ్చి ఆమెను కాటు వేసింది. స్థానికులు హుటాహుటిన ఆమెను ఆటోలో మెంటాడ పిహెచ్‌సికి తరలించారు. ప్రథమ చికిత్స చేసి కమ్యూనిటీ ఆస్పత్రికి రిఫర్ చేయగా, అప్పటికే ఆమె మృతిచెందింది.

యువకుడు అదృశ్యం

ప్రజాశక్తి- కంటోన్మెంట్

వన్ టౌన్ పరిధిలో ఒక యువకుడు అదృశ్యమైనట్లు సోమవారం పోలీసు కేసు నమోదు అయ్యింది. పోలీసుల కథనం ప్రకారం.. మహమ్మద్ తల్హా అనే యువకుడికి ఇన్‌స్టాగ్రామ్ లో ఫాతిమా అనే మహిళ పరిచయం అయ్యింది. ఆమెను పెళ్లిచేసుకుంటానని కుటుంబ సభ్యులకు తెలిపాడు. పాతిమా వయసు ఎక్కువని అని కుటుంబ సభ్యులు మందలించారు. ఈనేపథ్యంలో ఈ నెల 18న నెల్లిమర్లలో జాబ్‌మేళా కు వెళ్లి వస్తానని చెప్పి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు సోమవారం వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సిఐ ఆర్‌విఆర్‌కె చౌదరి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యభిచార గృహంపై దాడి.. ఒకరు అరెస్ట్

ప్రజాశక్తి - నెల్లిమర్ల

వ్యభిచార గృహంపై దాడి చేసి ఒకరిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ బి.గణేష్ తెలిపారు. టాస్క్ ఫోర్స్ పోలీసులు అందించిన సమాచారం మేరకు సోమవారం స్థానిక డైట్ కాలనీలో వ్యభిచార గృహంపై సిబ్బందితో దాడి చేసి వ్యభిచార గృహం నిర్వాహకురాలితో పాటు విటుడిని అరెస్టు చేసినట్లు తెలిపారు. కేసులో బాధితురాలికి కౌన్సిలింగ్ నిర్వహించి వారి బంధువులకి అప్పగించినట్లు తెలిపారు.

దమ్ముమడిలో ట్రాక్టర్ బోల్తా పడి రైతు మృతి

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని కొండగంగుపూడి పంచాయతీ ఎస్.కోట సీతారాంపురం గ్రామానికి చెందిన రైతు పరవాడ రామేశ్వరరావు(45) తన పొలంలో దమ్ము పడుతుండగా ట్రాక్టర్ బోల్తా పడి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. వర్షాలు కురవడంతో వరినాట్లు వేసేందుకు దమ్ముపడుతుండగా ఈ ఘటన జరిగింది. ఆయనకు భార్య వెంకటలక్ష్మి, తల్లి అచ్చియ్యమ్మ, ఇద్దరు కుమార్తెలు హైమావతి లీలావతి ఉన్నారు. టిడిపిలో క్రియాశీల కార్యకర్తగా ఉన్న రామేశ్వరరావు మృతి పట్ల పలువురు విచారం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సంఘటన జరిగిన వెంటనే గ్రామ పెద్దలందరూ మృతుని కుటుంబ సభ్యులను ఓదార్చారు



ఎంఎంసి చైర్‌పర్సన్‌కు అభినందనల వెల్లువ

ప్రజాశక్తి- నెల్లిమర్ల



గేదెల గాయత్రిని సత్కరిస్తున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

పూసపాటి రేగ ఎఎంసి చైర్‌పర్సన్‌గా నియమితులైన గేదెల గాయత్రికి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. నెల్లిమర్ల మండలం దన్నానపేట ఆమె స్వగృహానికి టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున చేరుకుని సోమవారం ఆమెకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా టిడిపి జిల్లా అధికార ప్రతినిధి, ఎఎంసి చైర్‌పర్సన్ భర్త గేదెల రాజారావు మాట్లాడుతూ పార్టీ నాయకులంతా ఉమ్మడిగా కలిసి ఉండటం వల్లే తమకు ఈ అవకాశం వచ్చిందన్నారు. శక్తి వంచన లేకుండా ఎఎంసి అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఆమెకు అభినందనలు తెలిపిన వారిలో గరికిపేట మాజీ సర్పంచ్ చింతపల్లి సత్యనారాయణ, డీలర్ల సంఘం మండల అధ్యక్షులు మహంతి శ్రీనివాసరావు, నాయకులు బెల్లాన ఈశ్వరరావు, త్రినాద్, ఆదినారాయణ, ఈశ్వరరావు, మోహన్, చంద్రంపేట, తంగుడుబిల్లి, ఒమ్మి నాయకులు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

లారీ డ్రైవర్‌పై దాడి

ప్రజాశక్తి- కంటోన్మెంట్

జొన్నవలస వద్ద బైపాస్ రోడ్‌లో లారీ డ్రైవర్‌పై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. విశాఖ జిల్లా ఆనందపురం నుంచి రాయగడకు కర్రల లోడుతో లారీ వెళ్తోంది .జోన్నవలస బైపాస్ రోడ్ లో లారీకి అడ్డంగా కొందరు వ్యక్తులు బైకు పెట్టి లారీ డ్రైవర్‌పై దాడి చేసి సెల్ పోన్, ఆరువేల రూపాయల నగదును లాక్కెల్లారు. గాయపడిన డ్రైవర్ ఎస్.సంతోష్ ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చేరాడు. ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ వి.అశోక్ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు